దరఖాస్తులను సకాలంలో పరిష్కరించాలి

ప్రజావాణిలో వరంగల్ కలెక్టర్ ప్రావీణ్య

వినతులను స్వీకరిస్తున్న కలెక్టర్ ప్రావీణ్య

గిర్మాజీపేట, మార్చి 11: ప్రజావాణిలో స్వీకరించిన దరఖాస్తులను సకాలంలో పరిష్కరించాలని కలెక్టర్ ప్రావీణ్య అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రజావాణి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజావాణి దరఖాస్తులకు ప్రాధాన్యతనివ్వాలన్నారు. కాగా, గ్రీవెన్స్‌లో రెవెన్యూ శాఖకు సంబంధించి 56, ఇతర శాఖలవి 30 కలిపి మొత్తం 86 దరఖాస్తులు రాగా, సంబంధిత శాఖల అధికారులకు సిఫార్సు చేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అశ్విని తానాజీ వాకడే, సంధ్యారాణి, నర్సంపేట ఆర్డీవో కృష్ణవేణి, జడ్పీ సీఈవో రాంరెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

మహిళలను తరలించేందుకు ఏర్పాట్లు

ప్రపంచ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో నిర్వహించే మహిళా సదస్సుకు జిల్లా నుంచి మహిళలను తరలించేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ప్రావీణ్య అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో వివిధ శాఖల అధికారులతో మహిళా సదస్సు విజయవంతంపై సమీక్షించారు. జిల్లా నుంచి 1500 మంది మహిళలను తరలించేందుకు 29 బస్సులు ఏర్పాటు చేయాలన్నారు. అంతకుముందు హైదరాబాద్ నుంచి కలెక్టర్లతో చీఫ్ సెక్రటరీ శాంతికుమారి టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించి, ఏర్పాట్లపై సమీక్షించారు.

సమస్యల పరిష్కారానికి గ్రీవెన్స్ వేదిక

వరంగల్, మార్చి 11 : కాలనీల సమస్యల పరిష్కారానికి గ్రీవెన్స్ వేదికగా నిలుస్తుందని బల్దియా అదనపు కమిషనర్ అనీసుర్ రషీద్ అన్నారు. సోమవారం కార్పొరేషన్ గ్రీవెన్స్‌లో ప్రజల నుంచి వినతులను స్వీకరించారు.మొత్తం 58 వినతులు రాగా, టౌన్ ప్లానింగ్ విభాగానికి 22, ఇంజినీరింగ్ విభాగం 17, ప్రజారోగ్య విభాగం 8, పన్నుల విభాగం 11 వినతులు వచ్చాయి. ఎస్ఈలు కృష్ణారావు, ప్రవీణ్ చంద్ర, సిటీ ప్లానర్ వెంకన్న, సీఎంహెచ్‌వో రాజేశ్, కార్యదర్శి విజయలక్ష్మి, హెచ్‌వో రమేశ్, డిప్యూటీ కమిషనర్లు రవీందర్, కృష్ణారెడ్డి, డీసీపీ ప్రకాశ్‌రెడ్డి పాల్గొన్నారు.

'జర్నలిస్టులను దూషించిన డీసీపీపై చర్యలు తీసుకోవాలి'

సుబేదారి/గిర్మాజీపేట, మార్చి 11 : వరంగల్‌లో అభివృద్ధి కార్యక్రమంలో ముగ్గురు జర్నలిస్టులను దూషించిన వరంగల్ సెంట్రల్ జోన్ డీసీపీపై చర్యలు తీసుకోవాలని వరంగల్ ప్రెస్‌క్లబ్ కార్యవర్గం, జర్నలిస్టు సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం బాలసముద్రంలోని ప్రెస్ క్లబ్ ఎదుట నల్లబ్యాడ్జీలు ధరించి, నిరసన తెలిపారు. కమిషనరేట్ వరకు ర్యాలీగా వచ్చి సీపీ అంబర్ కిశోర్ ఝాకు ఫిర్యాదు చేశారు. ప్రెస్‌క్లబ్ అధ్యక్ష, కార్యదర్శి లు వేముల నాగరాజు, బొల్లారం సదయ్య, కోశాధికారి అమర్, నాయకులు బీఆర్ లెనిన్, పిన్న శివకుమార్, కక్కెర్ల అనిల్‌కుమార్, శ్రీధర్‌రెడ్డి, రాంచందర్, దుర్గా ప్రసాద్, తోట సుధాకర్, సుభాష్, శ్యాం పాల్గొన్నారు. కాగా, డీసీపీ బారిపై ఇంతెజార్‌గంజ్ పీఎస్‌లో జర్నలిస్టులు నితీశ్, శ్యాం, అజయ్ వేర్వేరుగా ఫిర్యాదు చేశారు.

రైతుల కష్టాలను పట్టించుకోని కాంగ్రెస్

- ఇప్పటికే ఎండుతున్న పంటలు
- వచ్చే ఎంపీ ఎన్నికల్లో గులాబీ జెండా ఎగురవేయాలె..
- మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి

సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి

దామెర/ఆత్మకూరు, మార్చి 11 : 'రాష్ట్రంలో రైతులు అష్టకష్టాలు పడుతున్నరు. సాగునీరు లేక పంటలు ఎండిపోయి పశువులకు దాణాగా మారుతున్నాయి. ఈ పరిస్థితికి కాంగ్రెస్ ప్రభుత్వమే కారణం' అని పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు. సోమవారం దామెర మండలంలోని ఓగ్లాపురంలో, ఆత్మకూరులోని జీఎస్ఆర్ గార్డెన్స్‌లో బీఆర్ఎస్ మండల విస్తృత స్థాయి సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరు గ్యారెంటీల మాయ మాటలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ మూడు నెలల్లోనే ప్రజల విశ్వాసం కోల్పోయిందన్నారు. బీఆర్ఎస్ ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తే కాంగ్రెస్ ప్రభుత్వం కేసులు పెడుతున్నదని విమర్శించారు. 'రైతుల పంటలు ఎండుతున్నయ్.. సరిగా కరెంటు రావడం లేదు. రూ.2లక్షల రుణమా ఫీ లేదు. ఏ ఒక్క పథకం పూర్తి స్థాయిలో అమలు కావడం లేదు. కాంగ్రెస్ పాలన అంటేనే కరువులు, కష్టాలు అని ప్రజలు అర్థం చేసుకుంటున్నారు' అని అన్నారు. పరకాల నియోజకవర్గంలో అభివృద్ధి కనబడడం లేదని ప్రస్తుత ఎమ్మెల్యే పేర్కొనడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ప్రతీ గ్రామంలో బీఆర్ఎస్ చేసిన అభివృద్ధి కళ్లకు కనబడుతున్నదన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి అధికారంలోకి వచ్చి మూడు నెలలు దాటుతున్నా ఇంకా ఎలాంటి అభివృద్ధి చేయలేదన్నారు. పల్లెలు, పట్టణాల్లో నీళ్లు లేక ప్రజలు ట్యాంకర్ల కోసం ఎదురు చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పదేళ్లు బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ఇలాంటి కరువు పరిస్థితి లేదన్నారు. మేడిగడ్డ బరాజ్‌లో మూడు పిల్లర్లు కుంగితే మరమ్మతులు చేయాల్సింది పోయి కాళేశ్వరం ప్రాజెక్టు పనికి రాదని దుష్ప్రచారం చేయడం సరికాదన్నారు. సమావేశంలో ఎంపీపీ కాగితాల శంకర్, వైస్ ఎంపీపీలు జాకీర్ అలీ, రేవూరి సుధాకర్‌రెడ్డి, ఎంపీటీసీల ఫోరం మండలాధ్యక్షుడు పోలం కృపాకర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ బొల్లు రాజు, ఆత్మకూరు టౌన్ అధ్యక్షుడు పాపని రవీందర్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కాంతాల కేశవరెడ్డి, ఎంపీటీసీ బీరం రజినీకర్‌రెడ్డి, అధ్యక్షుడు గండు రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి ముదిగొండ కృష్ణమూర్తి, గరిగె కృష్ణమూర్తి పాల్గొన్నారు.

మహిళా సదస్సుకు ఏర్పాట్లు చేయాలి

కలెక్టర్ సిక్తా పట్నాయక్

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

హనుమకొండ, మార్చి 11 : సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో మంగళవారం జరుగనున్న మహిళా సదస్సుకు జిల్లా నుంచి మహిళలు వెళ్లేందుకు అధికారులు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. కలెక్టరేట్‌లో మహిళా సదస్సు ఏర్పాట్లు, ప్రజా పాలన సేవా కేంద్రాల నివేదిక సమన్వయ సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మహిళా సదస్సుకు వెళ్లేందుకు బస్సులతో పాటు ఇతర వసతులను ఏర్పాటు చేయాలన్నారు. జిల్లా నుంచి 1200 మంది సభకు వెళ్తున్నారన్నారు. అలాగే ప్రజాపాలన సేవా కేంద్రాల్లో ఇప్పటివరకు ఎన్ని దరఖాస్తులు వచ్చాయి.. సవరణలు ఎలా జరుగుతున్నాయి.. అనే వివరాలను ఎంపీడీవోలను అడిగి తెలుసుకున్నారు. మహిళా సదస్సు ఏర్పాట్ల గురించి డీఆర్డీవో నాగజ్యోతి వివరించారు. ప్రతి మండలానికి రెండు బస్సులను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. సమావేశంలో జడ్పీ సీఈవో విద్యాలత, డీపీవో లక్ష్మీరమాకాంత్, అడిషనల్ డీఆర్డీవో శ్రీనివాసరావు పాల్గొన్నారు.

గ్రీవెన్స్‌కు 176 దరఖాస్తులు..

కలెక్టరేట్‌లో నిర్వహించిన గ్రీవెన్స్ కార్యక్రమానికి భారీగా దరఖాస్తులు వచ్చాయి. ప్రజల నుంచి కలెక్టర్ సిక్తా పట్నాయక్ వినతులు స్వీకరించారు. వీటిలో రెవెన్యూ పరమైనవి 90, జీడబ్ల్యూఎంసీవి 22, పోలీస్ కమిషనర్ 6, విద్యాశాఖవి 6 దరఖాస్తులు ఉన్నాయి. ఫిర్యాదులను వెంటనే పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఉన్నతాధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ వెంకట్ రెడ్డి, డీఆర్వో వైవీ గణేశ్, సీపీవో సత్యనారాయణరెడ్డి, డీఎంహెచ్‌వో సాంబశివరావు, బీసీ వెల్ఫేర్ డీడీ రాంరెడ్డి, మైనారిటీ వెల్ఫేర్ డీడీ మేనశ్రీను పాల్గొన్నారు.

కుష్ఠు వ్యాధిపై అవగాహన కల్పించాలి

వరంగల్, మార్చి 11 : కుష్ఠువ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించాలని డీఎంహెచ్‌వో సాంబశివరావు అన్నారు. సోమవారం గుండ్లసింగారం పీహెచ్‌సీలో కుష్ఠు వ్యాధి నివారణపై అవగాహన కార్యక్రమం ప్రారంభించారు. వైద్య సిబ్బంది రెండు వారాల పాటు ఇంటింటా సర్వే నిర్వహించాలన్నారు. ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో అడిషనల్ డీఎంహెచ్‌వో మదన్‌మోహన్‌రావు, వైద్యురాలు సౌజన్య, డీహెచ్ఈవో సందేల శ్రీనివాస్, డీపీఎంవోలు గోపాల్‌రెడ్డి, కొమురయ్య, రవీందర్ బాబు పాల్గొన్నారు.

నేడు పీఏసీఎస్ చైర్మన్‌పై అవిశ్వాసం!

నర్సంపేట రూరల్, మార్చి11: నర్సంపేట పీఏసీఎస్ చైర్మన్‌పై మంగళవారం అవిశ్వాసం పెట్టేందుకు సొసైటీ డైరెక్టర్లు సిద్ధమయ్యారు. దీంతో సొసైటీ చైర్మన్ హైకోర్టును ఆశ్రయించారు. పీఏసీఎస్ చైర్మన్ మురాల మోహన్‌రెడ్డిపై ఇటీవల 9మంది డైరెక్టర్లు డీసీవోను కలిసి అవిశ్వాస తీర్మాన నోటీసులు అందించిన విషయం తెలిసిందే. బలనిరూపణ కోసం డీసీవో మంగళవారం సమావేశాన్ని స్థానిక పీఏసీఎస్‌లో ఏర్పాటు చేయనున్నట్లు నోటీసులు జారీ చేశారు. ఇదిలా ఉండగా దీనిపై పలు అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ సొసైటీ చైర్మన్ మోహన్‌రెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. ఈ నేపథ్యంలో అవిశ్వాస ప్రక్రియ సమావేశంతోపాటు ఫలితాల ప్రకటనను నిలిపివేయాలని హైకోర్టు ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం. కాగా, ఈ నెల 20న సొసైటీ ఫలితంపై హైకోర్టు తుది తీర్పు ఇవ్వనున్నది.

వేయిస్తంభాల గుడిలో మహా పూర్ణాహుతి

శివరాత్రి బ్రహ్మోత్సవాలు పరిసమాప్తం

హోమం చేస్తున్న గంగు ఉపేంద్రశర్మ

హనుమకొండ చౌరస్తా, మార్చి 11 : చారిత్రక రుద్రేశ్వర స్వామి దేవాలయంలో మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలు పరిసమాప్తమయ్యాయి. సోమవారం రుద్రేశ్వరునికి ప్రత్యేక పూజలు చేసినట్లు ప్రధానార్చకుడు గంగు ఉపేంద్రశర్మ తెలిపారు. గోధుమ పిండి, చక్కెర, అటుకులు, బెల్లం, నవ ధాన్యాలు, ముత్యం, పగడం, బంగారం, పట్టు వస్త్రాలతో మహా పూర్ణాహుతి నిర్వహించారు. ఆలయ ఈవో వెంకటయ్య ప్రసాదం పంపిణీ చేశారు. వైదిక కార్యక్రమాలను ప్రధాన అర్చకుడు గంగు ఉపేంద్రశర్మ, వేద పండితులు గంగు మణికంఠశర్మ, పెండ్యాల సందీప్‌శర్మ, వెంకట రమణాచార్యులు, మేఘానాథాచార్యులు, శ్రీవర్ధనాచార్యులు నిర్వర్తించారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

శాయంపేట, మార్చి 11 : అరులందరికి సంక్షేమ పథకాలను అందించేందుకు కృషి చేస్తానని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. సోమవారం మాందరిపేట కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలలో రూ.13 లక్షలతో చేపట్టే అభివృద్ధి పనులను ప్రారంభించారు. అనంతరం విద్యార్థులతో ముచ్చటించారు. ఇప్పుడు వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేస్తున్నామని, ఒక్కొక్కటిగా అన్ని సౌకర్యాలు కల్పిస్తానన్నారు. కొత్తగట్టు సింగారంలో రూ.5 లక్షలు, మందారిపేటలో రూ.10 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్లు, గట్లకానిపర్తిలో శివాలయం చుట్టూ రూ.10 లక్షలతో నిర్మించనున్న ప్రహరీ, కల్యాణ మండపం నిర్మాణం పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో దూదిపాల బుచ్చిరెడ్డి, చల్లా చక్రపాణి, పోలెపల్లి శ్రీనివాసరెడ్డి, ప్రత్యేకాధికారి మాధవి పాల్గొన్నారు.

ఇంగ్లిష్‌లో ప్రావీణ్యం పెంచుకోవాలి

కార్యక్రమంలో రిజిస్ట్రార్ మల్లారెడ్డి

హనుమకొండ చౌరస్తా, మార్చి 11 : ఇంగ్లిష్‌లో ప్రావీణ్యంతో పాటు మార్కెట్, కార్పొరేట్ అవసరాలకనుగుణంగా నైపుణ్యాలు పెంచుకోవాలని కేయూ రిజిస్ట్రార్ మల్లారెడ్డి అన్నారు. విశ్వవిద్యాలయ సెంటర్ ఫర్ ఇంగ్లిష్ లాంగ్వేజ్ టీచింగ్ (సెల్ట్) ఆధ్వర్యంలో నిర్వహించిన ఇంగ్లిష్ లాంగ్వేజ్ టీచింగ్ అండ్ పర్సనాలిటీ డెవలప్‌మెంట్ శిక్షణ తరగతుల 50వ బ్యాచ్ ముగింపు సమావేశం క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్ సురేశ్‌లాల్ అధ్యక్షతన జరిగింది. సెల్ట్ సంచాలకులు మేఘునారావు, ఇంగ్లిష్ విభాగాధిపతి దీపా జ్యోతి, స్టాటిస్టిక్స్ విభాగాధిపతి శ్రీనివాస్ పాల్గొన్నారు.

బారులుతీరిన దరఖాస్తుదారులు

నడికూడ : మండలంలోని కొన్ని గ్రామాల ప్రజలు జీరో బిల్లు రావడం లేదని ఆందోళన చెందారు. మండల పరిషత్ కార్యాలయంలో హెల్ప్ డెస్క్‌ను ఏర్పాటు చేయగా వినియోగదారులు తమ వివరాలను ఇవ్వడానికి సోమవారం బారులు తీరారు. ఆధార్, మీటర్ నంబర్ వివరాలను ఆన్‌లైన్ చేసుకోవాలని ఏఈ విశ్వప్రసాద్ తెలిపారు.

అనుమానాస్పదంగా వ్యక్తి మృతి

హనుమకొండ చౌరస్తా, మార్చి 11 : అనుమానాస్పదంగా వ్యక్తి మృతిచెందిన ఘటన అల్వాతండాకు వెళ్లేమార్గంలో జరిగింది. పోలీసులు కథనం ప్రకారం.. హనుమకొండ కుమార్‌పల్లికి చెందిన సింగరేణి రిటైర్డ్ కార్మికుడు గజెల్లి పోశం(70) భార్య గజెల్లి లక్ష్మితో చిన్న చిన్న విషయాల్లో గొడవ పడుతుండేవాడు. 4 నెలల క్రితం గొడవ పడగా ఆశ్రమంలో ఉంటానని లక్ష్మి హైదరాబాద్‌కు వెళ్లింది. దీంతో ఇంటిపద్దనే ఉంటున్న పోశానికి ఈనెల 9న రాత్రి 8.30 గంటలకు ఫోన్ రాగా మాట్లాడుకుంటూ బయటికి వెళ్లాడు. తిరిగి రాలేదు. సోమవారం ఉదయం కోమటిపల్లి రైల్వేగేటు వద్ద అతడి మృతదేహం కనిపించింది. అతడి కుడివేలు చేతిపై, ముక్కుపై గాయాలున్నాయని, సంఘటన స్థలంలో మద్యం సీసాలు కూడా ఉన్నాయని మృతుడి కూతురు నలుబోలు దివ్య తెలిపారు. తమ బాబాయ్ గజెల్లి రాజేశంపై అనుమానం ఉందని కేయూ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పెళ్లి పత్రికలు పంచడానికి వెళ్లి వరుడి అదృశ్యం

కృష్ణతేజ(ఫైల్)

హనుమకొండ చౌరస్తా, మార్చి 11 : పెళ్లి పత్రికలు పంచడానికి వెళ్లిన వరుడు అదృశ్యమయ్యాడు. తల్లి భూక్యా శకుంతల, కేయూ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హనుమకొండ గోకుల్‌నగర్‌కు చెందిన కృష్ణతేజకు నర్సంపేటకు చెందిన యువతితో ఈ నెల 16న వివాహం నిశ్చయించారు. కాగా, ఆదివారం కృష్ణతేజ పెళ్లి పత్రికలు పంచడం కోసం బయటకు వెళ్లి తిరిగి రాలేదు. సోమవారం ఉదయం కృష్ణతేజ తీసుకెళ్లిన బైక్ పలివేల్పులలోని కెనాల్ వద్ద ఉందని సమాచారం వచ్చింది. కానీ, కృష్ణతేజ కన్పించలేదన్నారు. తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గంజాయి రవాణా చేస్తున్న తల్లీకొడుకు అరెస్ట్

సుబేదారి, మార్చి 11 : గంజాయి రవాణా చేస్తున్న ఇద్దరిని పోలీసులు పట్టుకొని 51 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై రవి కిరణ్ కథనం ప్రకారం.. ఆదివారం రాత్రి హనుమకొండ హంటర్‌రోడ్డులో వాహనాలు తనిఖీ చేస్తున్న సమయంలో ఒడిశా రాష్ట్రానికి చెందిన తల్లీకొడుకులు లీమ రాజకుమారి, జయ రాజు రూ.7.79ల క్షల విలువైన 51కిలోల గంజాయి రవాణా చేస్తూ పట్టుబడ్డారు. గంజాయి, రెండు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకుని నిందితులను కోర్టులో హాజరు పరిచినట్లు ఎస్సై తెలిపారు.

బస్సులో ప్రయాణికుడికి గుండెపోటు

వరంగల్ చౌరస్తా, మార్చి11: ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తూ గుండెపోటుతో ఒకరు మృతి చెందిన ఘటన వరంగల్ బస్టాండ్‌లో చోటు చేసుకుంది. సోమవారం పర్వతగిరి మండలం చౌటపల్లి నుంచి వరంగల్ బస్టాండ్‌కు వచ్చిన వ్యక్తి బస్సు దిగలేదు. కండక్టర్ లేపే ప్రయత్నం చేయడంతో ఒక్కసారిగా బస్సులోనే కుప్పకూలాడు. అక్కడే విధులు నిర్వర్తిస్తున్న కానిస్టేబుల్ సంతోష్ సీపీఆర్ చేసినా ఫలితం లేకపోయింది. ఇంతేజార్‌గంజ్ పోలీసులు చేరుకొని మృతదేహాన్ని ఎంజీఎం దవాఖానకు తరలించారు. సెల్‌ఫోన్ ఆధారంగా మృతుడు పర్వతగిరి మండలం మైలారానికి చెందిన స్వర్ణకారుడు నారోజు ఉపేంద్రాచారి(45)గా గుర్తించి, కుటుంబసభ్యులకు సమాచారం అందించారు.

వాహనం ఢీకొని మహిళ మృతి

గీసుగొండ, మార్చి 11 : గుర్తు తెలియని వాహనం ఢీకొని మహిళ మృతి చెందిన ఘటన మండలంలోని మచ్చాపురంలో సోమవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కోల శ్రీలత (55) గ్రామంలోని తన కుమార్తె ఇంటి నుంచి తన ఇంటికి వెళ్తుండగా, వరంగల్ ప్రధాన రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందింది. ఆమె కుమారుడు నరేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

ఉరేసుకుని ఒకరు ఆత్మహత్య

ఎల్కతుర్తి, మార్చి 11 : జీవితంపై విరక్తితో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆదివారం రాత్రి ఎల్కతుర్తిలో జరిగింది. ఎస్సై రాజ్‌కుమార్ కథనం ప్రకారం.. మంచిర్యాల జిల్లా చెన్నూర్‌కు చెందిన గాజుల కోటేశ్వర్(55) కొన్నేండ్లుగా కుటుంబానికి దూరంగా ధర్మసాగర్ మండలం దేవునూర్‌లో ఉంటున్నాడు. ఇటీవల ఎల్కతుర్తిలోని హోటల్‌లో పనిచేస్తూ అక్కడే ఉంటున్నాడు. కొద్ది రోజులుగా హోటల్ తెరవక పోవడంతో ఆదివారం రాత్రి జీవితంపై విరక్తి చెందిన కోటేశ్వర్ హోటల్‌లోనే ఉరేసుకున్నాడు.

నాటకాలు ఆలోచింపజేస్తాయి..

మాట్లాడుతున్న సంధ్యారాణి

పోచమ్మమైదాన్, మార్చి 11: నాటకాలు ఆలోచింపజేస్తాయని వరంగల్ అడిషనల్ కలెక్టర్ సంధ్యారాణి (రెవెన్యూ) అన్నారు. సహృదయ సాహిత్య సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నాటికల ప్రదర్శనలు సోమవారం మూడో రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా రాత్రి ప్రారంభమైన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. సమాజంలో మనిషిని మంచిమార్గం వైపు పయనింపజేసేదే నాటకమన్నారు. పారితోషిక దాతలు డాక్టర్ రాధాకృష్ణ, సుందరరామ్మూర్తి, డాక్టర్ టీ లక్ష్మణ్‌రావు ప్రసంగించారు. అనంతరం ఉషోదయ కళానికేతన్ కాట్రపాడు ఆధ్వర్యంలో 'విముక్తి' నాటికను ప్రదర్శించారు. అలాగే, మైత్రి కళా నిలయం వారు బంధం నాటిక ప్రదర్శించారు. కార్యక్రమంలో సహృదయ సంస్థ బాధ్యులు గిరిజా మనోహరబాబు, కే కృష్ణమూర్తి, ఎన్‌వీఎన్ చారి, పీ అశోక్‌కుమార్, వెంకట్, కళా రాజేశ్వర్, జూలూరి నాగరాజు, సీతా వెంకట్, శ్రీధరస్వామి, రవీందర్, దేవులపల్లి శ్రీకాంత్, తిరుమల్లయ్య పాల్గొన్నారు.

జేఎన్ఎస్ సింథటిక్ ట్రాక్ ప్రారంభం

హనుమకొండ చౌరస్తా, మార్చి 11 : హనుమకొండలోని జేఎన్ఎస్‌లో రూ.7 కోట్లతో నిర్మించిన సింథటిక్ అథ్లెటిక్ ట్రాక్‌ను కేంద్ర యువజన, క్రీడా మంత్రిత్వశాఖ సహాయ మంత్రి నిసిత్ ప్రమాణిక్ వర్చువల్ విధానం ద్వారా సోమవారం ప్రారంభించారు. స్థానిక అథ్లెటిక్ ట్రాక్ పక్కనున్న వేదికపై ఎల్ ఈడీ స్క్రీన్ ద్వారా ప్రారంభోత్సవాన్ని జిల్లా క్రీడా సంఘాల బాధ్యులు వీక్షించారు. నిషా విద్యార్థి, చంద్రారెడ్డి, వరద రాజేశ్వరరావు, అజీజ్‌ఖాన్, కైలాసం యాదవ్, గుగులోత్ అశోక్‌కుమార్, వెంకటేశ్వరరావు, సారంగపాణి, శ్యామల పవన్‌కుమార్,రాంరెడ్డి పాల్గొన్నారు.

కాజీపేట అభివృద్ధే లక్ష్యం : ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

కాజీపేట, మార్చి 11 : నగరానికి ముఖ్య ద్వారంగా ఉన్న కాజీపేట పట్టణాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేయడమే లక్ష్యమని ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. కాజీపేట చౌరస్తాలో పోలీస్ స్టేషన్ నుంచి సోమిడి బొడ్రాయి వరకు చేపట్టనున్న 60 ఫీట్ల రోడ్డు విస్తరణ, డివైడర్, సెంట్రల్ లైటింగ్, వాటర్ పైప్‌లైన్ తదితర పలు అభివృద్ధి పనులకు సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాజీపేట చౌరస్తా ప్రాంతం చాలా ఏండ్ల నుంచి అభివృద్ధికి నోచుకోలేదన్నారు. అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు జక్కుల రవీందర్ యాదవ్, విజయశ్రీ రజాలీ, మాజీ కార్పొరేటర్లు రావుల సదానందం, రమా రవీందర్, సుంచు అశోక్, గుంటి కుమార స్వామి, రమణారెడ్డి, తాడిశెట్టి విద్యాసాగర్ పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించాలి..

న్యూశాయంపేట : గ్రేటర్ 31వ డివిజన్ దీన్‌దయాళ్‌నగర్‌లోని సమస్యలను త్వరగా పరిష్కరించాలని ఎమ్మెల్యే నాయిని అధికారులను ఆదేశించారు. ఆయన కాలనీలో పర్యటించారు. అనంతరం మాట్లాడుతూ అభివృద్ధి పనుల ప్రతిపాదనలను తన దృష్టికి తీసుకురావాలన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ మహ్మద్ అజీజ్‌ఖాన్, కార్పొరేటర్లు మామిండ్ల రాజు, నెక్కొండ కల్పనాకిషన్, మానస-రాంప్రసాద్, వీకటి శారద-ఆనంద్, మాజీ కార్పొరేటర్లు తాడిశెట్టి విద్యాసాగర్, రవినాయక్, నాయిని లక్ష్మారెడ్డి, నలుబోల సతీశ్, తోట పవన్, శ్రవణ్ పాల్గొన్నారు.

హసన్‌పర్తి : బియ్యం అందిస్తున్న చేరాలు

బాధితులకు బియ్యం అందజేత

హసన్‌పర్తి/నల్లబెల్లి, మార్చి 11 : మండలంలోని సీతంపేటకు చెందిన మేకల కట్టయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. ఎంపీటీసీ బండారి రజితా చేరాలు బాధిత కుటుంబ సభ్యులను సోమవారం పరామర్శించి బియ్యం, నిత్యావసర సరుకులు అందజేశారు. వారివెంట హేమంత్, శ్రీను, రాజయ్య ఉన్నారు. అలాగే, నల్లబెల్లి మండలంలోని గుండ్లపహాడ్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త తాటికాయల సాయిలు ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా బాధిత కుటుంబానికి బీఆర్ఎస్ నాయకుడు వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో 50 కేజీల బియ్యం అందజేశారు. బైర పాక సుధాకర్, సల్లా యాదగిరి, ఎర్ర మోహన్, తాటికాయల సూరయ్య, రంజిత్, రవి, రాజు పాల్గొన్నారు.

కేథడ్రల్ చర్చిలో ఫాతిమా ఉత్సవాలు

న్యూశాయంపేట, మార్చి 11 : కాజీపేట ఫాతిమా మాత దేవాలయం(కేథడ్రల్) చర్చి ప్రాంగణంలో సిల్వర్ జూబ్లీ, గోల్డెన్ జూబ్లీ వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. వేడుకలను ఫాదర్ జయప్రతాపరెడ్డి, ఫాదర్ ఇన్నారెడ్డి ప్రారంభించారు. ఫాతిమా కేథడ్రల్ విచారణ ఫాదర్ కాసుమరెడ్డి, ఫాదర్ సురేందర్, ఫాదర్ ప్రకాశ్, ఫాదర్ కరుణాకర్ పాల్గొన్నారు.

'మధ్యాహ్న' బిల్లులు చెల్లించాలి

నల్లబెల్లి, మార్చి 11 : ప్రభుత్వ పాఠశాలల మధ్యాహ్న భోజన ఏజెన్సీలకు తక్షణమే బిల్లులు విడుదల చేయాలని కోరుతూ తెలంగాణ ఉద్యమకారుడు బట్టు సాంబయ్య సోమవారం సీఎం రేవంత్‌రెడ్డికి మండల కేంద్రంలోని పోస్టాఫీస్‌లో రిజిస్టర్ పోస్ట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 5 నెలలుగా వంట ఏజెన్సీలకు ప్రభుత్వం బిల్లులు చెల్లించక పోవడం వల్ల మహిళలు వడ్డీలకు తెచ్చి విద్యార్థులకు భోజనం పెడుతున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి పెండింగ్ బిల్లులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో ఇద్దరికి జైలు

పోచమ్మమైదాన్, మార్చి 11: వరంగల్ ట్రాఫిక్ పీఎస్ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో ఇద్దరికి వరంగల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ గుర్రపు వీరస్వామి సోమవారం రెండు రోజుల జైలు శిక్ష విధించినట్లు ట్రాఫిక్ సీఐ శ్రీధర్ తెలిపారు. ఈ నెల 4న దేశాయిపేట, కాశీబుగ్గకు చెందిన ఇద్దరిని పట్టుకుని కోర్టులో హాజరుపరచగా జడ్జి శిక్ష విధించినట్లు పేర్కొన్నారు.

బాధిత కుటుంబానికి అరూరి పరామర్శ

నివాళులర్పిస్తున్న అరూరి రమేశ్